# జీవితాన్ని చదువుకో

స్వరూప్ సిన్హా

**ఉత్తరాన్ని కసికొద్దీ చించి అవతల పారేసాడు అజయ్. ఇలా ఇంటినుంచి వచ్చిన ఉత్తరాల్ని చించి పారెయ్యడం ఇది ఆరో సారి! రాను రానూ అతనిలో అసహనం పెరిగిపోతోంది. "ఛఛ... పాడు లైఫ్!" చీదరించు కున్నాడు మరోసారి.**

అతనంతగా చీదరించుకుంటున్నది అతని 'ఓన్ లైఫ్'ను కాదు! తనను కన్న తన 'పేరెంట్స్ లైఫ్'ను! విసురుగా వంకీకున్న చొక్కా తీసుకుని తొడుక్కుని రూము తలుపులు దభాలున వేసి, తాళం నొక్కి బయటపడ్డాడు. నడుస్తుంటే యెందుకో మనసంతా కసిరేగుతోంది! హాస్టలుకు దగ్గరే ఉన్న నాయర్ హోటల్లో కూలబడ్డాడు ఉసూరుమంటూ. సిగరెట్ నోట్లో కుక్కుకుని పక్కనే బడ్డీలో ఉన్న బుడ్డిమంటతో వెలిగించుకున్నాడు

"ఏం గురూ మంచి కసిమీదున్నట్టున్నావు, రాత్రి పార్టీ తాలూకు హేంగోవరా లేక ఇంటి నుంచి ఉత్తరమేదైనా వచ్చిందా 'నాయనా చిట్టీ, తక్షణమే పి హెచ్.డీ మానేసి వచ్చేయ'మని. ఏదీ నాకో సిగరెట్టు కొట్టించు, నేన్నీకు స్ట్రాంగ్ టీ కొట్టిస్తాను రేయ్ రాజూ టీలందించే కుర్రాణ్ణి కేకేసి బ్రక్కసీట్లో కూచున్నాడు మిత్రుడు బాబూరావు.

"ఏముందిరా మామూలే! 'ఎం ఫిల్ అయిపోయింది కదా, ఇంకా ఎందుకు నాయనా చదువు? చదివింది చాలు. ఇక ఇంటికొచ్చెయ్. నీతో పి హెచ్ డి చేయించే స్తోమత మాకు లేదు మనూళ్లో సెంట్రల్ గవర్నమెంటుది స్కూలొకటి పెట్టారు కరస్పాండెంటు తెలిసినాయనే ఉద్యోగం ఇస్తాడట నిన్ను పిలిపించమంటున్నాడు కాంపిటేటివ్ పరీక్షలు ఉద్యోగం చేసుకుంటూ రాసుకుందువు గాని. పెళ్లి చేసుకుని కోడల్ని తెస్తే ఇంట్లో అమ్మకు తోడుగా ఉంటుంది ఏ వయసుకాముచ్చట.' ఛ.. ఇలాగేరా మా నాన్న రాసే ఉత్తరాలెప్పుడూ ఇలాగే తగలడుతుంటాయి అసలు జీవితం పట్ల వీళ్ల 'ఆటిట్యూడ్' చాలా ఛీప్‌రా అన్నీ సామాన్యమైన కోరికలే వీళ్లవి ఇదంతా ఎందుకంటే వీళ్లవి వట్టి వానాకాలం చదువులే! దానికి తగ్గట్టే వీళ్ల కోరికలు కూడా! నేనేదో డాక్టరేటు తెచ్చుకుని యూనివర్సిటీ ప్రొఫెసరో, సివిల్ సర్వీస్ ఎగ్జామ్‌రాసి ఏ ఐ ఏ ఎస్ ఆఫీసరో అట్ లీస్ట్ గ్రూప్‌వన్ ఆఫీసరో అవ్వాలనుకుంటే.. " పళ్లు నూరాడు అజయ్.

"మరి నీ అభిలాషను మనవి చేసుకోలేక పోయావా నీ మాతా పితరులతో. !"

"చెప్పానురా బాబూ! చెప్పి చెప్పి నా నాలుకయితే అరిగిపోయింది గానీ వాళ్ల మనసులు మాత్రం కరగలేదు. నలభై యాభై వేలు ఖర్చయితే అయ్యింది, ఢిల్లీకి కోచింగ్‌కు వెళతానన్నాను సివిల్ సర్వీసెస్ కోసం ... ఉహూ... ఏమీ లాభం లేకపోయింది. 'చదివిన చదువు చాల్లే. గవర్నమెంటు ఉద్యోగం ఏదో ఒకటి రాక పోదు. ప్రస్తుతానికీ ఉద్యోగంలో చేరి ప్రిపేర్ అవుదువుగాని ఇంటికొచ్చెయ్....!' ఇదీ వరస! ఇంత చదువూ చదివి వెధవ టీచరుద్యోగం చెయ్యాల్ట అ పల్లే, పట్నమూ కాని ఊళ్లో!.... బుద్ధిలేకపోతే సరి!"

"అలా కోపగించుకోకు భాయీ! కాస్త వాళ్ల పక్షాన కూడా ఆలోచించాలి గదా. ఇద్దరూ పెద్ద వాళ్లయిపోయారు. నువ్వు కాస్త ఇంటి పట్టున ఉండే ఏదైనా ఉద్యోగం చేస్తుంటే చేదోడూ వాదోడుగా ఉంటుంది. కన్నవాళ్ల కాబట్టి నీ ముద్దూ ముచ్చట వాళ్ళక్కాక మరెవరికి పడుతుంది చెప్పు! పెళ్లి చేయాలనుకోవడం వాళ్ల సహజమైన కోరికే. ఇందులో విపరీతమేమీ లేదు. అసలిది ఇండియా కాబట్టి సరిపోయింది. మనకిన్నేళ్లు వచ్చినా తల్లిదండ్రులు మనల్ని పోషిస్తున్నారు. మనమిలా హాస్టళ్లల్లో గడిపేస్తూ హాయిగా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నాము. అదే ఫారిన్ కంట్రీస్‌లో అయితే యువతరం కష్టపడి సంపాదించుకుని జల్సా చేస్తారు. పేరెంట్స్ మీద డిపెండ్ కారు. జీవితంలో పైకి రావాలన్నా అంతే! సొంత సంపాదనతోనే పైకొస్తారు." బాబూరావు ఇంకా ఏదో చెప్పబోతుండగా-

"మైగాడ్, నువ్వూ మొదలెట్టావా దుర్బుద్ధి? చాల్చాలు ఆపరాబాబూ, బుద్ధి గడ్డితిని నీతో నా స్వంత విషయాలు చెప్పాను. ఇంకెప్పుడూ చెప్పను" కసిగా చెంపలు వాయించేసుకున్నాడు 'రప రపా' మని.

సరిగ్గా అదే సమయంలో, అజయ్ అలా చెంపలు వాయించుకునే శబ్దానికి నేపథ్యంగా 'దభీ దభీ'మన్న చప్పుడు వినిపించింది, ఎవరి వీపో విమానం మోత మోగుతున్నట్టు! ఆశ్చర్యపోతూ మిత్రులిద్దరూ తమ సంభాషణను పక్కనపెట్టి చుట్టూ కలయజూసారు. హోటల్ మధ్యలో ఓ ఆసక్తికరమైన దృశ్యం అగుపించింది. నాయర్ టీ కాఫీలందించే రాజు అనే కుర్రాణ్ణి దొరకబుచ్చుకుని గట్టిగా తిడుతూ వాడివీపు మీద మద్దెల, బుర్రమీద ఘటం వగైరా వాయిద్యాలన్నీ అవలీలగా వాయించేస్తున్నాడు. వాడు ఏ మాత్రం తక్కువ తినకుండా, నాయర్‌ని బండబూతులు తిడుతూ, కాళ్లతో చేతుల్తో అందిన చోటల్లా కుమ్మేస్తూ సాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు తప్పించుకుపోవడానికి మిత్రులిద్దరూ లేచి అక్కడికి పరిగెత్తారు. ఈ లోపల రాజు నాయర్ పట్టు నుండి విడిపించుకుని పరిగెత్తిపోయి తలుపు దగ్గర నుంచున్నాడు రొప్పుతూ రోజుతూ! కాసేపు ప్రత్యర్థులిద్దరూ పళ్లుకొరుక్కుంటూ ఒకళ్లనొకళ్లు మింగేసేలా చూసుకుంటూ నించున్నారు. ఓ నిముషం తర్వాత రాజు టేబిలు మీద గ్లాసందుకొని మంచినీళ్లు గటగటా తాగేసి చెప్పాడు, "నేను సదివి తీరతాను. నీ ముండమోపి కాసా హోటల్లో పనిజెయ్యను" ఆవేశంతో వాడి ముక్కుపుటాలదురుతున్నాయి అసలే ఎర్రటి పిల్లాడేమో దెబ్బలతో, అవమానంతో అన్నిట్నీ మించి రోషంతో మధ్యాహ్నపు ఎండలో ఎర్రచేప పిల్లలా మిలమిలలాడిపోతున్నాడు

వాడు.

"అవున్రా యెదవా .. చదువుతావు. ఆడ నీ అయ్యకు కూడెవరు బెడ్తారు? నువ్వు పనిమానేసి స్కూలుకి పోతే ఎట్ల బ్రతుకుతావు? నేన్నీకు మూడు పూట్లా తిండిపెట్టి, బట్టలిచ్చి మీ ఊరికింత డబ్బు పంపిస్తుంటేనే గదా మీ వాళ్ల బ్రతుకుతున్నారు" మాట్లాడుతూ మాట్లాడుతూనే రెండంగల్లో కోతిలా గెంతి మళ్లీ వాణ్ణి దొరకపుచ్చుకుని వాద్యసంగీత కచేరీని మొదలెట్టబోతూంటే, అంతదాకా 'ఫ్రీ'గా వినోదించిన జనం కలగచేసుకుని నాయర్‌ను, రాజునూ ఎవళ్లకు వాళ్లను విడదీసారు బాబూరావు అడిగాడు సంగతేమిటని


"చూడండిసార్ నేనేమో వీడ్ని ఈ హోటల్లో బలవంతంగా కూలిచేయిస్తున్నానంట. వీడికేమో చదివి ఆఫీసరవ్వాలనుందట. నేనే వీడ్ని చెడగొడుతున్నానంట. వీడు రోజూ బడికిపోతే ఇక్కడ పనెవరు చేస్తారు? వీడి తండ్రి నన్ను పనిలో పెట్టుకోమని బ్రతిమాలితేనే నేను పెట్టుకున్నాను వీడికి ముప్పొద్దులా తిండి పెట్టడమే కాకుండా వీళ్ల యింటికి కొంత డబ్బు కూడా పంపుతున్నాను. కానీ వీడికేమయినా ఆ జ్ఞానముందా అని?"

"నువ్వేమి నాకు బువ్వ బెట్టనవసరంలే! నా కాడ పైసలున్నాయి. మా నాయనకు నీ పైసలవసరంలే. ఏదో ఓ దిక్కుపని జేస్కోని బ్రతుకుతడు. నేను మాత్రం ఈడ పనిజెయ్యను" గబగబా లోనికెళ్లి చిన్న సంచీ ఒకటి తీసుకొని దాన్ని చంకనబెట్టుకొని మరుక్షణం రివ్వున బయటికి పరిగెత్తాడు, మళ్లీ నాయరెక్కడ పట్టుకుంటాడోనన్న భయంతో.

"ఫో... నాయాల! నాలుగురోజులు కడుపులో కాలితో నువ్వే వస్తావు. చదువూ గిదువూ దిబ్బలో పడేసి...." కాండ్రించి ఉమ్మేసి వెళ్లి తన సీటులో కూచున్నాడు. అయిదు నిముషాల వరకూ ఏదో గొణుక్కుంటూనే ఉన్నాడతను.

బాబూరావు వైపుచూసి గర్వంగా నవ్వేడు అజయ్. అతనికేమి అర్థం కాలేదు. మౌనంగా టీ తాగేసి డబ్బు చెల్లించి బయటికొచ్చాక చెప్పాడు అజయ్, "ఆ వెధవకు చదువుకోమని నూరిపోసింది నేనే! రోజూ ఉదయం టీ దాగడానికి తొమ్మిదింటికి వచ్చేవాణ్ణి. వీణ్ణి పట్టుకుని దారినపోయే స్కూలు పిల్లల్ని చూపిస్తూ నచ్చజెప్పే వాణ్ణి చదువుకుంటే జీవితంలో సాధించలేనిదంటూ ఉండదని. ఇది వాడికి చదుకోవాల్సిన వయసని, కూలి చెయ్యాల్సిన వయసు కాదనీ, నేనింత పెద్ద వాణ్ణయినా గొప్ప వాణ్ణి అవ్వడానికే ఇంకా చదువుతున్నానని నా పుస్తకాలు చూపించి మొత్తంమీద వాడిలో 'రివల్యూషన్' తేగలిగాను "

"ఏడిసినట్టుంది గురూ! కుర్రవెధవకు తెలిసీ తెలియని వయసులో బతకడానికి ఉన్న ఆ కాస్త ఆధారాన్ని కూడా ఊడగొట్టావు ఇది 'రివల్యూషన్' కాదు 'రివర్షన్'! ఇప్పుడు చూడు వీడితో పాటుగా వీడి ఫ్యామిలీ మొత్తం 'సఫర్' అవ్వవలసి ఉంటుంది" చికాకును వ్యక్తపరిచాడు బాబూరావు.



# ఆరోగ్యానికి శాకాహారమే మంచిది!

**మాం**సాహారం కంటే శాకాహారమే గొప్పదంటున్నారు జర్మన్ శాస్త్రవేత్తలు. క్రొవ్వు పదార్థాలు భుజించే వారికంటే శాకాహారం తీసుకున్నవారు ఎక్కువ ఆరోగ్య వంతులుగా వుండటమే కాకుండా గుండె సంబంధమైన రోగాలకు దూరంగా వుండగలరట.

బెర్లిన్‌లోని జర్మన్ ఆరోగ్య కార్యాలయం వారు 1985లో ప్రారంభించిన బెర్లిన్ శాకాహార అధ్యయనం పై విషయం వెల్లడించింది.

ఈ అధ్యయనంలో 372 మంది శాకాహారులు పాల్గొన్నారు. శాకాహారం తీసుకునే వారి రక్తంలో యూరిక్ యాసిడ్ విలువలు చాలా తక్కువగా వుండటం, వాత సంబంధమైన రోగాల బారినుంచి కాపాడ బడటం మూలంగా వారు ఆరోగ్యవంతులుగా వున్నట్లు ఆ అధ్యయనం వివరించింది

ముఖ్యంగా గుండె సంబంధమైన రోగాలు శాకాహారుల జోలికి రావటం తక్కువని, మాంసాహారుల విషయంలో అలా కాదని, శాకాహారం మూలంగా మూత్రపిండాలు కూడా సక్రమంగా పని చేస్తాయని వెల్లడయింది. శాకాహారులతో పోలిస్తే మాంసాహారుల్లో మూడింట రెండు వంతులమంది అధిక రక్తపు పోటుతో బాధ పడినట్లు కనుగొన బడిందట.

క్రొవ్వు శాతం తక్కువగా వున్న పదార్థాలనే భుజించి ఆరోగ్యం కాపాడుకోవటం మంచిదే.

మనం భుజించే ఆహారం పైనే మనిషి ఆరోగ్యం ఆధారపడి వుందని, అదీ శాకాహారుల్లోనే సాధ్యమవుతుందని జర్మన్ శాస్త్ర వేత్తలు అంటున్నారంటే... మనం తెలిసి తెలిసి క్రొవ్వు పదార్థాల జోలికి పోవటం ఎందుకు? ఆ క్రొవ్వు పదార్థాలు తక్కువున్న శాకాహారాన్నే భుజించి మన ఆరోగ్యాన్ని కాపాడుకుందాం.

–తిలక్

"నోరుముయ్యరా....! మీరెవ్వరూ నన్నర్థం చేసుకోలేరు. మహానాయకులంతా ఒకప్పుడు కటిక పేదరికంలో మగ్గిపోయినవారే. రాజుగాడిలో ఆ పట్టుదల చూసావా? వీడూ రేపు గొప్పవాడవుతాడు నో డౌట్! వాడిలో వచ్చిన ఆ పరివర్తన చాలు..."

అజయ్ కోరిక మేరకు నోరుమూసుకున్నాడు బాబూరావు.

****

ఆ మర్నాడు తండ్రికి నిర్మొహమాటంగా ఉత్తరం రాసేసాడు అజయ్, తను పి హెచ్.డి. పూర్తి చేసి గాని రానని, ఆ చిరుద్యోగం తనకక్కరలేదని . తను జీవితంలో చాలా ఉన్నతస్థానానికి చేరుకోవాలనుకుంటున్నానని

మరో నెల రోజుల తరవాత--

యూనివర్సిటీకి దగ్గరలోనే "సివిల్ సర్వీసెస్"కు కోచింగ్ క్లాసులు ప్రారంభమయ్యాయి. అజయ్ సహచరులు చాలా మంది చేరారు బాబూరావుతోసహా. కానీ అజయ్‌కు చేరడానికి మనస్కరించలేదు. 'అప్టరాల్ ఈ ఊళ్లో యేమిటి, సివిల్ సర్వీసెస్‌కు కోచింగ్ యేమిటి? దిల్లో స్టాండర్డ్‌గా ఉంటుంది వెళితే ఢిల్లీ వెళ్లాలి లేకుంటే లేదు...' అనుకున్నాడు. ఇంటి నుంచి ఇరవై వేలు తెప్పించుకున్నాడు. మిగతా సొమ్ము నెల రోజుల్లోపల సర్దవలసి ఉంటుందని తండ్రికు త్తరం రాసాడు. 'రీసెర్చ్ గైడ్' పర్మిషన్ తీసుకుని, ట్రెయిన్‌లో బెర్తు రిజర్వు చేసుకోవడానికి స్టేషనుకెళుతూ యధాలాపంగా దారిలో నాయర్ హోటల్ వైపు చూసి ఉలిక్కిపడ్డాడు వాడే, రాజుగాడే! సందేహంలేదు. "సార్‌కు ఒణ్ణు స్ట్రాంగ్ టీ!" అంటూ హుషారుగా అటూ ఇటూ తిరుగుతూ టీలు సప్లై చేస్తూ ఉన్నాడు. సైకిలు స్టాండు వేసి లోనకెళ్లాడు అజయ్ "ఓ.... సార్, చాన్నాళ్లకొచ్చినారు కూచోండి. టీ స్ట్రాంగా, మీడియమా, లైటా?" నవ్వుతూ అడిగాడు ఒళ్లు మండింది అజయ్‌కు వీడారోజేదో హీరో లెవల్లో చదువుకోవడానికి కాసా హోటల్లో పని వదిలిపెట్టేసి వెళ్లి మళ్లీ దేభ్యపుమొహంతో ఇదే పనికి తయారయ్యాడు. వెంట బాబూరావు లేడు గాబట్టి సరిపోయింది. లేకుంటే ఇవ్వాళ తన పరువు నట్టేట్లో కలిసేది. డామ్ ఇన్సల్టింగ్! అవున్లే కాసా హోటళ్ల వెధవలకి కాసా బుద్ధులుగాక మరేం అబ్బుతాయి గనక అనుకుంటూ

వాణ్ణి దగ్గరకు పిలిచి గొంతు తగ్గించి అడిగాడు. వీడిలోని మార్పుకి తనేకారణమని నాయర్‌కు తెలిస్తే ప్రమాదం. ఈసారి తనను పట్టుకుని మృదంగం వాయించడం ఖాయమనిపించింది. అందుకే రహస్యంగా అడిగాడు "అదేమిట్రా చదువుకుంటానని ఆరోజు పనివదిలి పెట్టి వెళ్లి పోయావుగా... మళ్లీ దాపురించావెందుకూ.. బళ్ళో చేర లేదా?"

"లేదుసార్!" చాలా సిన్సియర్‌గా చేతులు కట్టుకుని చెప్పాడు.

"మరా రోజు అంత ఖచ్చితంగా ఛాలెంజ్ చేసి వెళ్లావు కదరా చదువుకుంటానని?" అసహనంగా అడిగాడు.

"నిజమేసార్, పోయినాను. కానీ రెండ్రోజులకి నా దగ్గర పైసలయిపోయినాయి. ఆకలయితే బువ్వ పెట్టేటోళ్లు లేరు. పస్తులుండి, నీళ్లుదాగి ఇంకో రెండ్రోజులు బతికిన. అప్పుడు నాయరన్న నన్నెతుక్కుంటూ రోడ్డు రోడ్డు దిరుగుతుండె నన్ను మల్లా ఈడికి తెచ్చినాడు. అప్పుడు తెల్సినాది సార్! బ్రతకడానికి ముందుగావల్సింది కడుపుకింత బువ్వగాని సదువుగాదని. ఉన్న నౌకరి ఇడిసిపెట్టి నాలుగు రోజులకే నేను కిందమీదయినాను ఒక్క నెల నాయరన్న పైసలు బంపియ్యకుంటె అడ మా అమ్మానాయన ఎంత కష్ట పడతారో తెలిసింది. వాండ్లు ముసలోల్లు సార్! పనిజేస్కోని బతకలేరు. నా మూలంగా వాండ్లు ఆకలితో సస్తరు గద సార్.. అందుకే వచ్చేసినా!" వాడి కనురెప్పల కలువరేకుల అంచున నీటిము

త్యాలు!

"ఇక జన్మలో చదువుకోనంటావ్. ఇలాగే అంట్లుతోముతూ, కసువులుకొడుతూ బతుకు" కసిగా అన్నాడు.

"అల్లనమాకండిసార్! నేనెప్పటికైనా సదువుకోని పైకొస్త. రాత్రిల్లు నాయరన్న సదివిపిస్తుండు. పరీక్షకు కట్టిపిస్తున్నడు. నవ్వేడు వాడు చొక్కా అంచుతో కళ్లు తుడుచుకుంటూ.

"ఏడిసాడు. ఈ నాయరు నీకెంత వరకు చదవు చెప్పగలడు? మహా అంటే మూడో తరగతి వరకు. అదే నువ్వు స్కూలు కెళ్లి ఉంటే...."

మధ్యలోనే మాటతుంచేసాడు వాడు. 'ఏందిసార్! మా నాయరన్న మూడో క్లాసు కంటె సదువు చెప్పలేడా?' వాడింకా యేదో అనబోతుండగా.

"సారుకు తెలియదు లేరా. నువ్వు పోయి ఆ బల్లకాడ వాళ్లకేమికావాల్నో చూడు ఇదిగోండిసార్ హాట్, స్ట్రాంగ్ టీ."

గతుక్కుమన్నాడు అజయ్. అయితే నాయరు తమ సంభాషణంతా విన్నాడన్న మాట.

"మా రాజు చెప్పాడు సార్ వాడికి చదువుకోమని మీరే చెప్పారట నేను వాడ్ని కూలి చేయించడానికి వెతికి పట్టుకొని రాలేదు సార్ వాళ్లమ్మా నాన్నలకు డబ్బు వాడు ఇక్కడ లేకున్నా పంపగలను అది కాదు సమస్య! వీణ్ణి ఇంతప్పట్నుంచీ నేనే పెంచాను సార్. ఆ మమకారం చంపుకోలేక పోయాను వాడ్ని చదివించి గొప్పవాణ్ణి చెయ్యాలని నాకూ ఆశ ఉంది! అందుకే నేనే వాడికి చదువు చెపుతున్నాను ఏదో నేను మీ అంత పెద్ద సదువులు చదువుకోక పోయినా ఎమ్.ఏ. పాసయ్యాను .." నమ్రతగా చెప్పాడు.

నెత్తిన పిడుగుపడ్డట్టు ఉలిక్కిపడ్డాడు అజయ్. "ఏమిటి?" నోరు వెళ్లబెట్టాడు!

"ఏంసార్? ఎమ్.ఏ. చదివి కాసా హోటల్ నడుపుకుంటున్న వెధవనని ఆశ్చర్యపోతున్నారా? అయితే నేను మాత్రం యీ పనిని నీచంగా భావించడంలేదు నా కుటుంబాన్ని పోషించుకోడానికి నేనెంచుకున్న మార్గం యిది! నేనొకరి మీద ఆధారపడటంలేదు.

ఏదైనా ఉద్యోగం వచ్చేవరకూ ఇలాగే ఉంటాను వస్తే ఈ హోటల్ని రాజు కిచ్చేస్తాను. లేకుంటే దీన్నే డెవలప్

## జీవితాన్ని చదువుకో!

చేసుకుంటాను. చదువులో మొట్టమొదటి పాఠం కష్టపడి పని చెయ్యడమే నని రాజుకు చెప్తూ ఉంటాను మనం ముందుగా చదవాల్సింది జీవితాన్ని సార్. పుస్తకాల్ని కాదు స్వతంత్రంగా, గౌరవంగా జీవించడమే ఈ చదువు మనకు నేర్పేది! చదువు సంస్కారాన్ని నేర్పుతుంది. నిజమేసార్! కానీ పుస్తకాల్ని చదవలేని వాళ్లంతా కుసంస్కారులూ, నీతి మాలినోళ్లూ మాత్రం కాదు సార్. వాళ్లం తకంటే విలువైన జీవితాన్ని చదివి అనుభవాన్ని మననం చేసుకుంటారు...."

ముచ్చెమటలు పోస్తున్నాయి అజయ్‌కు


తను చదివిన చదువు నిజంగానే సంస్కారాన్ని నేర్పిందా? ఎన్నో సార్లు బార్‌ల నుండి, బీరుపార్టీల నుండి, 'బ్లూ'ఫిలిమ్ పార్లర్లనుండీ, పేకాట నుండీ, వడుపు వీధుల్నుండీ..... ఇంకా మరెన్నెన్నో విలాసాల నుండీ, ఇదే రోడ్డుమీద ఒంటిమీద స్పృహలేకుండా, మిత్రబృందంతో నవ్వుతూ తుళ్లుతూ, నోటికొచ్చినట్లు పేలుతూ ఇదే రోడ్డుని, ఇదే హోటల్ ముందు నుంచి వెళ్లడం గుర్తొచ్చి సిగ్గుతో చితికి పోయాడతను. ఇదే 'కల్చర్' ఇదే 'సోషల్ బిహేవియర్' ఇది 'లా అఫ్ ది లైఫ్'

అని ఎన్నెన్నో ఉపన్యాసాలిచ్చేవాడు అజయ్ తాగిన మైకంలో! ఇక అక్కడుండ లేక బయటికొచ్చేసాడు, వెనక నుండి నాయర్ 'టీ' తాగి వెళ్లమంటున్నా వినిపించుకోకుండా.

అతని మనసంతా శూన్యంగా ఉంది. నెలక్రితం డబ్బు పంపుతూ తండ్రి వ్రాసిన ఉత్తరం గుర్తొచ్చిందతనికి. 'నీ యిష్టప్రకారమే కానీ బాబూ. నీ కోచింగ్ కోసం అమ్మతాళిబొట్టుతో సహా నగల్ని అమ్మేసింది. నేను ఉన్న కొద్దిపాటి పొలమూ అమ్మేసాను. ఇల్లు గడవడం కష్టంగా ఉంది మేమిద్దరమూ కూలికి పోతున్నాము నీకు త్వరగా మంచి ఉద్యోగం రావాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ ఉన్నాము.' ఆ ఉత్తరంతో పాటుగా, 'నాయనా అమ్మా నాన్న ఆకలితో సస్తరు గదసార్' రాజు కన్నీళ్లతో బేలగా అడగటం గుర్తొస్తుంది 'చదువూ సంధ్యా లేనోళ్లంతా కుసంస్కారులూ నీతి మాలినోళ్లూ కాదు సార్!' నాయర్ గంభీరమైన స్వరం గుండెను తూట్లు పొడుస్తోంది

అజయ్ సైకిల్ వేగాన్నందుకుంది రైల్వేస్టేషన్ వైపు కాదు! పోస్టాఫీసు వైపు జీవిత పాఠంలో మొదటి పుటను చదివిన అజయ్ తండ్రికేమని ఉత్తరం వ్రాసాడో మీరు తేలిగ్గా ఊహించగలరు ◯

## సినిమాలకు రాజేష్‌ఖన్నా స్వస్తి



ప్రముఖ హిందీ నటుడు రాజేష్ ఖన్నా తన 25 సంవత్సరాల నటజీవితానికి స్వస్తి చెప్పి రాజకీయాల్లోకి చేరిపోవాలనుకుంటున్నాడట. ఈ విషయాన్ని తానే స్వయంగా యిటీవల తెలియజేశాడు. మరి చిత్రాలలో అవకాశాలు రాకపోతే ఏదో మార్గం ఎన్నుకోవాలిగా! కాంగ్రెస్ వాది అయిన ఖన్నాకు బొంబాయి నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్న అభిలాష మెండుగా వుంది అందుకే నటనకు స్వస్తి చెప్తున్నానంటున్నాడు. 155 చిత్రాలకు పైగా నటించిన రాజేష్‌ఖన్నా డింపుల్ కపాడియాకు విడాకులివ్వలేదని, వదంతులు నమ్మవద్దని కూడా ఈ సందర్భంగా తెలియజేశాడు.